బార్ అసోసియేషన్ ఎన్నికల్లో..

నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఈ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు అడ్వకేట్లు మధుసూదన్‌రెడ్డి, రవీందర్‌రావు తదితరులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

– అంబర్‌పేట, ఏప్రిల్ 4

పచ్చని ప్రకృతిపై సీఎం పగ

చార్మినార్, ఏప్రిల్ 4: సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల ఊపిరి ఆగేలా పచ్చదనంపై కన్నెర్ర జేశారని బీఆర్‌ఎస్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. తొలి సీఎం కేసీఆర్ పదేళ్లపాటు పచ్చదనాన్ని పెంచితే ప్రస్తుత ప్రభుత్వం అడవుల సంరక్షణ పచ్చదనాన్ని ధ్వంసం చేస్తున్నదని మండిపడ్డారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణలో 37% అటవీ విస్తీర్ణం పెరిగిందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ధమననీతితో ప్రభుత్వ భూ ములను తన అనుగణానికి అప్పజెప్పడానికి ఆగమేఘాల మీద యూనివర్సిటీ భూములను చెరపట్టిందని అన్నారు. వందల ఎకరాల యూనివర్సిటీ భూములపై కన్నేసిన రేవంత్ రెడ్డి అక్కడి జీవరాసులను లెక్కపెట్టకుండా అడవి సంపదను నేలకుల్చాడని తెలిపారు. కేవలం కాసులకు కక్కుర్తి పడి విలువైన అటవీ సంపదను విద్యార్థుల భవితవ్యాన్ని ఫణంగా పెట్టి యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం చేయడానికి సీఎం సిద్ధపడ్డాడని అన్నారు. కోర్టులు మొట్టికాయలు వేసినా తన పద్ధతి మార్చుకోకుండా రాజకీయాల్లో తన పెట్టుబడిని తిరిగి పొందడమే లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతున్నాడని విచారం వ్యక్తం చేశారు. రేవంత్ తగిన విధంగా సమాధానం చెప్పడానికి విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు, మేధావులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

ఉచిత కంటి పరీక్షలు

గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆక్సెస్ ఫౌండేషన్తో కలిసి ఉచిత కంటి పరీక్షలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు, తల్లిదండ్రులు దాదాపు 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి కళ్ళద్దాలు అందించారు. కాటారాక్ట్ ఆపరేషన్ కూడా అక్సెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా చేస్తామని హామీ ఇచ్చారు.

– మెహిదీపట్నం, ఏప్రిల్ 4

ఫంక్షన్‌హాల్ పెండింగ్ పనులు పూర్తి చేయండి

జీహెచ్‌ఎంసీ సర్కిల్–14 ఏఈ రాధిక కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్, ఏప్రిల్ 4: గోషామహల్ నియోజకవర్గంలోని చుడిబజార్‌లో పెండింగ్‌లో ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని గోషామహల్ బీఆర్‌ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులను కోరారు. శుక్రవారం ఆయన ఏఈ రాధికను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి దివంగత నాయిని నరసింహారెడ్డి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ కోసం రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేయించారని వివరించారు. ఎనిమిది సంవత్సరాలుగా ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. ఇటీవల ఉగాది పర్వదిన వేడుకలకు మాదిగ బంధు మిత్ర సంఘం ప్రతినిధులు తనను ఆహ్వానించి, పెండింగ్‌లో ఉన్న ఫంక్షన్ హాల్ గురించి వివరించి, పనులు పూర్తి చేయించేలా అభ్యర్థించినట్లు వివరించారు. దీంతో స్పందించిన ఏఈ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయిస్తానని హామీ ఇవ్వడంతో చుడీబజార్ వాసుల తరపున ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. మాదిగ బంధుమిత్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ సుమన్ కుమార్, వెంకటేశ్, అనిల్ కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే వరదనీరు..

- ఇంకా తొలగని ప్రజల కష్టాలు

ఛే నంబర్ ఫ్లైఓవర్ కింద నిలిచిన వరదనీరు

కాచిగూడ ఆర్టీసీ క్వార్టర్స్ రోడ్డులో ఇంకా తొలగించని వరదనీరు

అంబర్‌పేట, ఏప్రిల్ 4ః గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి అంబర్‌పేటలోని చాలా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇండ్లలోకి కూడా నీళ్లు వచ్చాయి. రాత్రి వరకు వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.ఈ వానకు ఇంకా కొన్ని చోట్ల రోడ్లపై వరదనీరు నిలిచి ఉండడంతో శుక్రవారం కూడా ప్రజలు ఇక్కట్ల పాలయ్యారు. ప్రధానంగా అంబర్‌పేట ఛేనంబర్ ఫ్లైఓవర్ కింద వరదనీరు నిలిచిఉండడంతో వాహనదారుల రాకపోకలు ఇబ్బంది కలిగింది. వరదనీటిలో నుంచే ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే కాచిగూడ ఆర్టీసీ క్వార్టర్స్ రోడ్డులో కూడా వరదనీరు రోడ్డుపైనే ఉంది. జీహెచ్‌ఎంసీ సిబ్బంది దాన్ని తొలగించే చర్యలు కూడా తీసుకోలేదు. వరదనీరు నిలవడంతో ప్రజలు అందులో నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ రెండు చోట్ల కూడా వరదనీటితో పాటు రోడ్డు కూడా కంకరతేలి ఉండడంతో కొందరు వాహనదారులు టైర్ స్లిప్ అయి కిందపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా జీహెచ్ ఎంసీ సిబ్బంది స్పందించి వరదనీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాచీన కళలను కాపాడుకోవాలి

కళాకారులకు ప్రశంస పత్రాలు అందజేసిన సంస్కార భారతి రాష్ట్ర సంఘటన మంత్రి నిరంజన్

కాచిగూడ, ఏప్రిల్ 4: అందరం కలిసికట్టుగా ప్రాచీన కళలను కాపాడుకోవాలని సంస్కార భారతి, రాష్ట్ర సంఘటన మంత్రి నిరంజన్ అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని సంచలన స్కూల్ ఆఫ్‌డాన్స్ ఆధ్వర్యంలో వసంతోత్సవాల్లో భాగంగా 5వ రోజు కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, వివిధ సంస్కృత కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నిరంజన్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రాచీన కళలను నేటి యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్, సజారీత, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యాలతో రెస్టారెంట్లు చెలగాటం

- టోలీచౌకి హకీంపేట్ చౌరస్తా లో ఉన్న ఫెల్‌ఫెలాహ్ రెస్టారెంట్లో ఆహారం తిన్న 40 మందికి అస్వస్థత

హకీంపేట్ చౌరస్తాలో ఉన్న ఫెల్ ఫెలాహ్ రెస్టారెంట్

మెహిదీపట్నం, ఏప్రిల్ 4 : ప్రజల ఆరోగ్యంతో రెస్టారెంట్ల వాళ్లు చెలగాటమాడుతున్నారు. టోలిచౌకి హకీంపేట్ చౌరస్తాలో ఉన్న ఫెల్ ఫెలాహ్ రెస్టారెంట్‌లో రంజాన్ పండుగకు ముందు రోజు ఇద్దరు యువకులు చికెన్‌కు సంబంధించిన ఆహార పదార్థాలను తిన్నారు. శుక్రవారం నానల్ నగర్ సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో వారు తీవ్ర అనారోగ్యంతో చికిత్స కోసం వెళ్లారు. డాక్టర్లు వీరిని పరీక్షించి నాలుగు రోజులుగా సుమారు 40 మంది ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకుని వెళ్లారని వారికి చెప్పారు. వీరందరూ అదే రెస్టారెంట్లో ఆహారం తిన్నట్లు డాక్టర్లు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు రెస్టారెంట్ నిర్వాహకులపై మండిపడుతున్నారు. గతంలో కూడా ఈ రెస్టారెంట్లో ఇలాంటి ఘటన చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు ఈ రెస్టారెంట్ పై దాడి చేసి కఠిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బీసీ రిజర్వేషన్లను రాజకీయం చేయకండి

అభివాదం చేస్తున్న దాసు సురేశ్, గజ్జ సత్యం, జిల్లపల్లి అంజి, నీల వెంకటేశ్

రవీంద్రభారతి, ఏప్రిల్ 4: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ప్రభుత్వ కాం ట్రాక్టులో పార్టీపరమైన అవకాశాలలో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న హామీని దాటవేసే దిశగా కొనసాగుతూ, ఈ అంశాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బం డారు పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన మీసీ మేధావులు, విద్యావంతుల, ఉద్యమకారుల సమావేశంలో దాసు సురేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీసీ హక్కుల స్థాప న కోసం పాటుపడుతున్న నాయకులు, మే ధావులు, క్షేత్రస్థాయి కార్యకర్తల సమక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్న అమలు చేసే అంశంపై ప్రభుత్వా న్ని ఆయన ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు అమలు ముమ్మరం చేయకుండానే, అసెంబ్లీలో ఆమోదం పొంది న బీసీ బిల్లుకు గవర్నర్ ఆమోదం పొందకుండానే 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయకుండానే ఢిల్లీలో ధర్నాలు చేస్తుండటం పట్ల కాం గ్రెస్ పార్టీ దమననీతికి నిదర్శనమన్నారు.కాంగ్రెస్‌పార్టీ డైవర్షన్ పాలిటిక్స్‌లో భా గంగానే తెలంగాణ ప్రభుత్వం అమలు చే యాల్సిన 42 శాతం రిజర్వేషన్లను తుంగలో తొక్కి కేంద్రంపై దుమ్మెత్తటం ఏమాత్రం సమంజసం కాదన్నారు. 5 సంవత్సరాలు బీసీలకు లక్ష కోట్లు కేటాయిస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీ, ఇప్పటివరకు రూ. 20వేల కోట్లను ప్రతిపాదించి, కనీసం ఐదు కోట్లు కూడా ఖర్చు చేయలేదని అన్నారు. కార్పొరేషన్ చైర్మన్ల నియామకంలోగాని కనుచూపు మేర కనిపించకపోవడం కాంగ్రెస్ పార్టీ ద్వంద‌నీతికి నిదర్శన మన్నారు. కులసంఘాలు, రాజకీయ పార్టీలను, సామాజిక ఉద్యమకారులను సమన్వం చేసుకొని ఢిల్లీకి తీసుకువెళుతామని ముఖ్యమంత్రి చేసిన అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్ముడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, బీసీ నేతలు ప్రసంగించారు.

అందరూ సమిష్టిగా జరుపుకునే ఉత్సవమే శ్రీరామనవమి

సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంతరావు

అబిడ్స్ ఏప్రిల్ 4: భాగ్యనగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించే శ్రీరామనవమి శోభాయాత్ర అందరూ సమిష్టిగా జరుపుకునే ఉత్సవమని భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంతరావు, ప్రధాన కార్యదర్శి గోవింద నారాయణరాఠీ అన్నారు. శుక్రవారం బాహితి భవన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు శోభాయాత్ర వివరాలను వెల్లడించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని శనివారం సీతారాం బాగ్ లోని ఆలయంలో సీతారామ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం శ్రీరామనవమి శోభాయాత్ర కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. మధ్యాహ్నం ప్రారంభమై బోయిగూడ కమాన్, మంగళ్‌హాట్, జాలిహనుమాన్, పురాణాపూల్, జుమ్మరాత్‌బజార్, బేగంబజార్ ఛత్రి, సిద్ధంబర్‌బజార్ మీదుగా సుల్తాన్ బజార్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ శోభాయాత్రకు ముఖ్య అతిథులుగా ఉత్తర ప్రదేశ్ కు చెందిన అనంత శ్రీ విభూతి స్వామి అదోక్షజానానంద్, దేవుడు తీర్థ జీ మహారాజ్, త్రిపుర రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ శ్రీ రామ్ ప్రసాద్ శోభాయాత్ర మార్గంలోని పలు ప్రాంతాలలో ప్రసంగిస్తారని తెలిపారు. 2010 నుంచి నిర్వహిస్తూ వస్తున్న ఈ శోభాయాత్ర అనతి కాలంలోనే జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని గడిచిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉత్సవ సమితి నాయకులు కరోడి మాల్, మెట్టు వైకుంతం, శ్రీరాం వ్యాస్, మహేందర్ వ్యాస్, మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా దంపతులు, నటరాజ్‌నామ్ దారి, బి. నరసింహ తదితరులు పాల్గొన్నారు.

6న కాచిగూడ తుల్జా భవన్లో శ్రీ సీతారాముల కల్యాణం

కాచిగూడ, ఏప్రిల్ 4: తెలంగాణ దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6 వ తేదీ(ఆదివారం)కాచిగూడ తుల్జా భవన్‌లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తుల్జా భవన్ ధర్మశాల కార్య నిర్వహణ అధికారి ఎస్.అంజనారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 6వ తేదీ ఉదయం 10 గంటలకు వేదపండితులతో సీతారాముల కల్యాణం ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం ఒంటిగంటకు భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. రాత్రి 7 గంటలకు సీతారాముల ఉత్సవమూర్తుల పల్లకి ఊరేగింపు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సీతారాముల కల్యాణం చేయించాలనుకునే భక్తులు ముం దుగా రూ.1,116 లు చెల్లించి రసీదు తీసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 939 240 6492లో సంప్రదించాలని కోరారు. సీతారామ కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారాముల ఆశీర్వాదం పొందాలని కోరారు.

ఐక్యతను చాటేవిధంగా సీతా రాముల శోభాయాత్ర

కాచిగూడ, ఏప్రిల్ 4: హిందువుల ఐక్యత, ఔన్నత్యాన్ని చాటే విధంగా సీతారాముల శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్ రావు అన్నారు. శుక్రవారం కాచిగూడ శ్యాం బాబా మందిర్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఈ శోభాయాత్రలో పాల్గొని ప్రజ లు భక్తిని చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శోభాయాత్ర అంబర్‌పేట గ్రౌండ్ నుంచి కాచిగూడ ఎక్స్‌రోడ్ వీర్‌సావర్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందని తెలిపా రు. ఈ సీతరాముల శోభాయాత్రకు ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి, శ్రీ చైతన్య శక్తిపీఠం, సిద్ధ మహా యోగ పీఠం పీఠాధిశ్ శ్రీ చైతన్య నంద మహారాజ్ విచ్చేయనున్నట్లు తెలిపారు.

ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ర్యాలీ

చిన్న వడమాల గ్రామంలో ఉండే శ్రీ శ్రీ శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దర్శనానికి తెలంగాణ త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ గా కాచిగూడ రైల్వే స్టేషన్ నుండి 400 మంది భక్తులు రైల్లో తెలంగాణ ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు దేవేందర్, సభ్యులు రవీంద్రారెడ్డి, ఉపేందర్, రామరాజు, రామకృష్ణ, పంచాక్షరి, సుధాకర్, లత, లలిత, వసంత, కవిత, మాధవి, కృష్ణవేణితో పాటు అధిక సంఖ్యలో భక్తులు రైల్లో తాడిపత్రికి బయలుదేరి వెళ్లారు.

– కాచిగూడ, ఏప్రిల్ 4

వెంకటాద్రి రైల్లో దొంగతనం

కాచిగూడ, ఏప్రిల్ 4: వెంకటాద్రి రైల్లో దొంగతనం జరిగింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన ప్రకారం.. మసాబ్ ట్యాంక్ ప్రాంతానికి చెందిన ఎం. కల్పన(50) వెంకటాద్రి రైల్లో కాచిగూడకు వస్తుండగా బోగోల్ రైల్వే స్టేషన్ సమీపంలో సిగ్నల్ పడడంతో రైలు ఆగింది. ఇదే అదనంగా భావించిన గుర్తుతెలియని దుండగులు కిటికీలోంచి కల్పన మెడలో ఉన్న రెండున్నర తులాల మంగళసూత్రాన్ని దొంగిలించారు. శుక్రవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని, తదుపరి విచారణ నిమిత్తం కర్నూల్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వేసీఐ తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం

చార్మినార్, ఏప్రిల్ 4: కుటుంబ సభ్యులతో కలిసి మార్కెట్ వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయిన ఘటన చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సౌమ్య తెలిపిన వివరాల ప్రకారం గోల్కొండ ప్రాంతంలో నివసించే హసన్ అలీ (60) కూతురు కర్ణాటక బీదర్‌లో నివసిస్తుంది రంజాన్ సందర్భంగా తల్లి ఇంటికి వచ్చిన ఆమె చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మదీనా ప్రాంతంలో కొత్త బట్టలు కొనుగోళ్ల కోసం హసన్ అలితో సహా కుటుంబ సభ్యులందరు వచ్చారు. హసన్ అలీ మానసిక, చెవిటి సమస్యలతో బాధపడుతున్నాడు. దీనితో కుటుంబ సభ్యులు అతన్ని సమీపంలోని హోటల్ వద్ద కూర్చోబెట్టి బట్టల కొనుగోళ్ల కోసం వెళ్లారు. కొద్ది సమయం తరువాత తిరిగి వచ్చి చూడగా హసన్ అలీ కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. హసన్ అలీని ఎవరైనా గుర్తిస్తే చార్మినార్ పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.

'నవ్వండహే' హాస్య నాటిక సంపుటి ఆవిష్కరణ

రవీంద్రభారతి, ఏప్రిల్ 4: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఉదయసాహితీ–తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రచయిత కళా మాధవి రచించిన 'నవ్వండహే' బాలల హాస్య నాటికల సంపుటి ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. సాహితీవేత్త శ్రీ దాస్యం సేనాధిపతి సభా అధ్యక్షతన జరిగిన ఈ పుస్తకావిష్కరణ సభకు వక్తలుగా నేటి నిజం పత్రిక సంపాదకులు బైస దేవాసు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కళా మాధవి రచించిన 'నవ్వండహే బాలల హాస్య నాటిక సంపుటిని ఆవిష్కరించి రచయిత తండ్రి అయిన ఉప్పులూరి శ్రీరామ చంద్రమూర్తికి ఇవ్వడం జరిగింది.

ఆకట్టుకున్న ఇండియా ఆర్ట్ ఫెస్టివల్



గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ క్రౌన్ కన్వెన్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన వివిధ కళాకృతులు



కార్వాన్, ఏప్రిల్4 : కళాకారులు తమ రంగాన్ని మరింత పెంపొందించుకునే విధంగా మార్కెట్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ డైరెక్టర్ రాజేంద్ర అన్నారు. గుడిమల్కాపూర్ లోని కింగ్స్ క్రౌన్ కన్వెన్షన్ హాల్‌లో ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ పేరుతో మూడు రోజల కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతి ఏటా వేలాది మంది కళాకారులు పట్టభద్రులై వస్తున్నప్పటికీ వారికి తమ కళను ప్రదర్శించే సరైన అవకాశం లభించడం లేదని అన్నారు. దేశంలో 2 లక్షల మంది కళాకారులు ఉన్నారని తెలిపారు. నగర ప్రజలు తమ తమ ఇండ్లను మంచి సృజనాత్మకతతో, కళా ఖండాలతో ఏర్పాటు చేసుకోవాలనుకునే వారికి తాము ఏర్పాటు చేసిన ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ చక్కని వేదిక అవుతుందని అన్నారు. ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌లో హైద్రాబాద్, బెంగుళూరు, న్యూ ఢిల్లీ, ముంబై, బరోడా, పానిపట్, సింగపూర్, పుణే తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు పాల్గొని తమతమ కళాకృతులను ప్రదర్శించారు.

పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలు

వసంతోత్సవాన్ని ప్రారంభించిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 4: పండుగలు మన సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి అన్నారు. నవ్యసాహితీ సమితి, నవ్య నాటక సమితి సంయుక్తాధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా వసంతోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఫణీంద్ర రచించిన శ్రీ రామాయణ తారావళి దృశ్య కావ్యాన్ని జస్టిస్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. అనంతరం నృత్య గురువు మాధవీమాల శిష్య బృందం వాసంతిక శీర్షికన చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను విశేషంగా అలరించింది. ప్రముఖ కవులచే ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి. వసుంధర, తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్, నవ్య నాటక సమితి అధ్యక్షులు వేమరాజు విజయకుమార్, కార్యదర్శి ఆర్.ఎన్ సుధారాణి,నవ్య సాహితీ సమితి కోశాధికారి హరనాథ్‌బాబు, కార్యదర్శి లక్ష్మీమానస తదితరులు పాల్గొన్నారు.

సుందరకాండ ప్రవచనాలు

గోల్నాక వీరన్న గుట్ట శివాలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం సందరకాండ ప్రవచనాలు వినిపించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ హాజరయ్యారు.

– గోల్నాక, ఏప్రిల్ 4

రామరాజ్యం రావాలి

అబిడ్స్, ఏప్రిల్ 4 : హిందువులు ఒకటి కావాలి రామరాజ్యం రావాలని తాను శ్రీరామనవమి శోభయాత్ర నిర్వహిస్తున్నట్లు గోషామహల్ ఎమ్మెల్యే టి రాజాసింగ్ అన్నారు. శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహిస్తున్న తనపై అనేక కేసులు పెట్టారని ఏ కేసుకు కూడా భయపడకుండా తాను శోభాయాత్రను నిర్వహిస్తూ వస్తున్నట్లు తెలిపారు. అయితే శోభాయాత్రకు జనం రాకుండా ఉండాలని పెద్ద ఎత్తున కుట్ర చేస్తున్నారని, ఇందుకోసం అంబర్‌పేట నుంచి మరో క శోభాయాత్ర నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని ఎత్తులు వేసిన శోభాయాత్రకు వచ్చే జనాన్ని ఆపలేరన్నారు. పార్టీలో పైరవీ కారులకు టికెట్లను కేటాయిస్తున్నారని పరోక్షంగా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం ఖరారుపై ఆయన ఆరోపణలు చేశారు.

నానల్ నగర్ లో.. కమిషనర్ పర్యటన

వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. శుక్రవారం ఉదయం కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ తో కలిసి ఆయన పర్యటించారు. గురువారం కురిసిన వర్షంతో హకీంపేట్ ప్రభుత్వ పాఠశాల వద్ద వర్షం నీరు నిలిచిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై ఎమ్మెల్యే కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, శుక్రవారం కమిషనర్ ఈ ప్రాంతంలో పర్యటించారు. వర్షాలు కురిసినప్పుడు ఎలాంటి సమస్యలు లేకుండా ముం దస్తు చర్యలు చేపట్టడానికి అధికారులు కృషి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్, కార్పొరేటర్ నసీరుద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, ఏప్రిల్ 4

బజరంగ్ సేన ర్యాలీ



గోమాతను రాష్ట్ర మాత గా ప్రకటించాలని బజరంగ్ సేన ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్లో ర్యాలీ నిర్వహించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు వినతి పత్రం సమర్పించారు. బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి భారీగా బజరంగ్ సేన నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లి ర్యాలీలో పాల్గొన్నారు.

– అబిడ్స్

నమ్మించి .. దోచుకున్న దొంగ బాబా

కాచిగూడ, ఏప్రిల్ 4: దోశనివారణ చేస్తాను. అని ఓ మహిళను నమ్మించి పెద్ద మొత్తంలో నగదు, బంగారం తీసుకొని పరారైన ఓ బురిడిబాబా ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం. తిలక్‌నగర్‌లో ఉంటున్న గీతవైద్య అనే మహిళ భర్త దిల్‌సుఖ్‌నగర్‌లోని వశిష్ట జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తుండేవారు. ఏడాది క్రితం అతను చనిపోవడంతో అతని స్థానంలో భార్య గీతవైద్య అదే కళాశాలలో లెక్చరర్‌గా చేరింది. అదే సమయంలో కళాశాల ప్రిన్సిపాల్ సౌమ్య ఏవైనా దోశాలు ఉంటే పోగొడతాడని ఎల్బీనగర్‌లో ఉంటున్న శివస్వామి అనే వ్యక్తని గీతవైద్యకు పరిచయం చేసింది. ప్రిన్సిపాల్ పరిచయం చేయడంతో నమ్మిన ఆమె అతను చెప్పినట్లు పూజలు చేయడం ప్రారంభించింది. ఆ శివస్వామి పూజలు చేయించే క్రమంలో వారిని మరింత భయపెట్టి ఆమె నుంచి రూ.1.70లక్షలు, ఆమె దగ్గర నుంచి 26 తులాల బంగారంతో పాటు గీతవైద్య ఉంటున్న ఇల్లు(ప్లాట్) కాగితాలు తీసుకున్నాడు. అయితే ఇది తెలుసుకున్న మెడిసిన్ చదువుతున్న గీతవైద్య కూతురు వెంటనే తల్లిని తీసుకొని ఎల్బీనగర్‌లో ఉంటున్న శివస్వామి ఇంటికి వెళ్లి ప్లాట్ కాగితాలు ఇవ్వాలని అడిగి తీసుకుంది. బంగారం అడిగితే అతను ఇవ్వలేదు. దీంతో కాచిగూడకు వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.